క్లుప్తంగా

అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగింపు


అక్షింతల ఊరేగింపులో భక్తులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో అయోధ్యరామ మందిరం నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలను గురువారం గ్రామ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుల ఆధ్వర్యాన గ్రామంలో ఊరేగింపు చేసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో వంశీ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు నగర సంకీర్తన

కామేపల్లి: కామేపల్లిలో నేడు(శుక్రవారం) శ్రీ రాముడి నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ రాముడి జన్మస్థలం అయోధ్య నుంచి అక్షింతలు వచ్చిన సందర్భంగా నేడు ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన నిర్వహించి అన్ని గ్రామ పంచాయతీలకు అక్షింతలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవధూతేంద్ర భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, సభ్యులు నాగుబండి హనుమంతరావు, అమిరినేని దయానంద్, భాగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండాకు చెందిన తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి తండ్రి అజ్మీరా గోబ్రియానాయక్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గోబ్రియానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

తిరుమలాయపాలెం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోనే స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంతో విద్యార్థుల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అన్నారు. ఈ దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంఘంగా గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు భగత్ సింగ్, చేగువేరా, అంబేడ్కర్ స్ఫూర్తితో నిరంతరం దేశ సమైక్యత కోసం పోరాటాలే శరణ్యంగా పనిచేస్తుందని చెప్పారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వరుణ్‌కుమార్, మాజీ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, కొమ్ము మహేశ్, నాయకులు పవన్ సిద్దార్థ, కావ్య, భార్గవి, మణికంఠ, మనీషా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	సలార్
సాయిరాం	డెవిల్
ఆదిత్య	సలార్
శ్రీనివాస	సలార్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	56		20
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	70	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	2
దొండ	60		10
సొరకాయ	26	గోంగూర	2
చిక్కుడు	120		10
గోరుచిక్కుడు	70	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	56	పుదీన	1
క్యారెట్	50		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

సందడిగా ప్రజాపాలన..


29వ డివిజన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరిన స్థానికులు


10వ డివిజన్‌లో పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

- డివిజన్‌కు ఎనిమిది, పంచాయతీకి మూడు కౌంటర్ల చొప్పున ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుండే బారులుదీరిన జనం
- కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వసతుల ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పథకం కింద చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను అధికారులు ప్రారంభించారు. తొలిరోజు గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5, 6, 9, 10, 11, 13, 17, 29, 19, 24 డివిజన్లలో ప్రజాపాలనను ఉదయం 8 గంటలకే మున్సిపల్ అధికారులు ప్రారంభించగా.. దరఖాస్తుదారులు అక్కడకు చేరుకొని దరఖాస్తులను సమర్పించారు. ఒక్కో డివిజన్‌కు 8 కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేసి, పురుషులు, మహిళల నుంచి వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ఈనేపథ్యాన పలు ప్రాంతాల్లో ఇంటింటికి దరఖాస్తులు అందించగా.. అందని వారికి సభ నిర్వహించే ప్రాంతంలో ఇచ్చారు. అంతేకాక దరఖాస్తును నింపడానికి హెల్ప్ డెస్క్‌లు, ఉచిత వైద్య శిబిరాలు, టెంట్లు, మంచినీటి సౌకర్యాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు నాలుగు డివిజన్లలో 'సభలు'..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4 డివిజన్లలో గల 10 కేంద్రాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకు ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన లోకేషన్లు, టీమ్ లీడర్ల వివరాలను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. 3వ డివిజన్ బల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో టీమ్ లీడర్ టి.ధరణికుమార్ (7780587720), జెడ్పీహెచ్‌ఎస్ బల్లేపల్లిలో టి.రంగారావు(7901298205), 7వ డివిజన్ టేకులపల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద సీహెచ్.స్వామి(9849906095), మహిళా ప్రాంగణంలో సీహెచ్.సురేశ్‌బాబు(9502812588) ఆధ్వర్యాన దరఖాస్తులు స్వీకరించనున్నారు. అలాగే 8వ డివిజన్ బాలపేట ప్రాథమిక పాఠశాలలో వి.రంజిత్(7995075408), పాత 2బీహెచ్‌కే వద్ద బి.సత్యనారాయణ(9550615505), కొత్త 2బీహెచ్‌కే వద్ద కె.వికాస్ (8008661119), గోపాలపురం పాఠశాల ఎ.క్రిష్ణాలాల్(9849903607), 1వ డివిజన్ ఖైకొండాయ్‌గూడెంలో సీహెచ్.స్వామి (9849906095), ఎస్సీ స్టడీసర్కిల్‌లో రంజిత్ కుమార్(9182270695) ఆధ్వర్యాన దరఖాస్తులు తీసుకోనున్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీ..

నగరంలో దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలను కార్పొరేషన్ పరిధిలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, రఘునాథపాలెం మండలంలోని ఆరు పంచాయతీల్లో మండల ప్రత్యేక అధికారి డీసీఓ విజయకుమారి, సీఐ శ్రీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ విల్సన్ బెన్నీ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేటాయించిన రోజున దరఖాస్తులు చేసుకోలేకపోతే మరుసటి రోజు నుంచి జనవరి 6వ తేదీ వరకు అదే కేంద్రాల్లో దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. ఇక దరఖాస్తు అందజేసిన వారికి టీమ్ లీడర్లు సంతకం చేసి, కేఎంసీ స్టాంప్ వేసి ఇస్తున్న రశీదును భద్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. కాగా, రఘునాథపాలెం మండలంలోని బావోజితండాలో 165 కుటుంబాలకు గాను 180పైగా దరఖాస్తులు రావడం విశేషం. ప్రజలు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఐదు పథకాలు పొందేందుకు ఒకే దరఖాస్తును చేసుకునేలా వీలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల పథకాలపై ప్రజల అభిప్రాయాలను వారిమాటల్లోనే చూద్దాం..

పథకాలు అందేలా చూడాలి..


ప్రభుత్వం 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తు కూడా ఉచితంగా ఇంటికి వచ్చి అందించడంతో పాటు వారే పూర్తి చేసి ఇచ్చారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

– జి.శ్రీను, ఆరెగూడెం, నేలకొండపల్లి మండలం

ఒక్కటే దరఖాస్తు బాగుంది..


ప్రభుత్వం ఐదు పథకాలకు సంబంధించి ఒకటే దరఖాస్తు తీసుకోవడం బాగుంది. మాకున్న ఇంటి స్థలంలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నా. గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ పథకం కోసం దరఖాస్తులో టిక్ చేశాను. మా డివిజన్‌కు వచ్చి దరఖాస్తులు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– చల్లా వాణి, 29వ డివిజన్, ఖమ్మం

వృద్ధాప్య పెన్షన్ కోసం..


ప్రభుత్వం అందించనున్న చేయూత పథకం కింద వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తు చేశాను. గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ పథకానికి టిక్ పెట్టాను. అధికారుల సంతకంతో రశీదు ఇవ్వడం ప్రజాపాలనకు అద్దం పడుతుంది. డివిజన్‌కు వచ్చి దరఖాస్తులు తీసుకోవడం బాగుంది.

– అర్వపల్లి శ్రీనివాస్, 29వ డివిజన్, ఖమ్మం

ఐదు పథకాలకూ దరఖాస్తు చేశా..


తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో ఐదు పథకాలకు దరఖాస్తు చేసుకున్నా. గతంలో ఎన్నో దరఖాస్తులు పెట్టుకున్నాం. కానీ ఒక్క పథకం కూడా అందలేదు. ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉంది. పథకాలు అందిస్తారని ఆశిస్తున్నాం.

– పి.మాధవి, అనంతనగర్, నేలకొండపల్లి మండలం

పోటెత్తిన దరఖాస్తులు..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలకు తొలిరోజు గురువారం విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ప్రజలు క్యూలో నిల్చొని దరఖాస్తులు సమర్పించారు. దీంతో గ్రామ సభల సందడి వాతావరణం నెలకొంది.


రోటరీనగర్ కేంద్రంలో దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు


రఘునాథపాలెం: బద్యాతండాలో రశీదు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ


రఘునాథపాలెం: బావోజితండాలో దరఖాస్తులు పూరిస్తున్న సిబ్బంది


ప్రొఫెసర్ జయశంకర్ పార్క్‌లో దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు


రోటరీనగర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్లు


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేలకొండపల్లి: మండలంలోని ఐదు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా.. ప్రతీ సభలో దరఖాస్తుల స్వీకరణకు మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. కాగా, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ సభలను పర్యవేక్షించారు.

కూసుమంచి మండలంలో..

కూసుమంచి: మండలంలోని ఆరు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించగా.. ఇట్టి కార్యక్రమాన్ని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేశ్వరీ, కూసుమంచి మండల ప్రత్యేకాధికారి జి.శ్రీలత పరిశీలించగా.. ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

కామేపల్లి మండలంలో..

కామేపల్లి: మండలంలోని నాలుగు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి రవిబాబు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యాన దరఖాస్తులను స్వీకరించి దరఖాస్తుదారులకు రశీదును అందించారు.

ఖమ్మంరూరల్ మండలంలో..

ఖమ్మంరూరల్: మండలంలోని నాలుగు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించగా.. తహసీల్దార్ రామక్రిష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలో..

తిరుమలాయపాలెం: మండలంలోని ఐదు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయనిర్మల, ఏడీఏ విజయచంద్ర, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీపీ బోడ మంగీలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రాజేశ్వరి, ఎస్సై వరాల శ్రీనివాస్, ఏఓ సీతారాం రెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కామేపల్లి మండలంలో..

కామేపల్లి: మండలంలోని జోగ్గూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభను జెడ్పీ సీఈఓ యింజం అప్పారావు పర్యవేక్షించి సిబ్బందికి, దరఖాస్తుదారులకు పలు సూచనలు చేశారు. ఈనేపథ్యాన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఫొటో లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులను నిలదీయగా.. కాసేపయ్యాక ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు చేయడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర రెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, సర్పంచ్ జర్పుల భగవాన్, ఎంపీటీసీ ఏపూరి హేమమాలిని, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.


కామేపల్లి: దరఖాస్తుదారులకు సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు


తిరుమలాయపాలెం: తిమ్మక్కపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


కామేపల్లి: టేకులతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


ఖమ్మంరూరల్: దరఖాస్తుదారులకు రశీదు ఇస్తున్న అధికారులు


కూసుమంచి: గ్రామ సభ వద్ద పర్యవేక్షిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి, తదితరులు


నేలకొండపల్లి: కోనాయిగూడెంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరామ్

పేదల పక్షాన పోరాడేది కాంగ్రెస్సే..

పేద ప్రజల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీనేనని పలువురు నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేంత వరకూ పార్టీ కార్యకర్తలు అహర్నిశలు కష్టపడాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


కామేపల్లి: కేక్ కట్ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి


ఖమ్మంరూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో.. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి


కూసుమంచిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


తిరుమలాయపాలెం: కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకుడు చావా శివరామకృష్ణ

పోలీస్ స్టేషన్ సమీపాన బైక్ చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ సమీపాన దొంగలు తమ ప్రతాపం చూపించారు. పోలీసుస్టేషన్‌కు కూతవేట దూరాన ఉన్న ఏటీఎం వద్ద గ్రామానికి చెందిన వంగవీటి లక్ష్మణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనాన్ని బుధవారం రాత్రి పార్క్ చేశాడు. గురువారం ఉదయం కల్లా వాహనం లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెరుకు కూలీకి పాముకాటు

నేలకొండపల్లి: చెరుకు నరుకుతున్న కూలీ పాముకాటుకు గురయ్యాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఉమాదేవిపురానికి చెందిన కూలీలు నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో చెరుకు నరికేందుకు వచ్చారు. గురువారం ఓ రైతు పొలంలో చెరుకు నరుకుతుండగా కె.బాబు అనే కూలీని పాము కాటేసింది. దీంతో ఆయన సహచరులు నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మం తీసుకెళ్లారు.

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పోస్టు కార్డులు


పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. గురువారం ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ సబ్ క్యాంపస్ వద్ద విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు సీఎంకు పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్ మాట్లాడుతూ.. కొత్తగూడెం కేంద్రంగా మైనింగ్ యూనివర్సిటీ , భద్రాచలం కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ , ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని వివధ రూపాలలో విద్యార్థి, యువజన సంఘాలు అనేక ఆందోళనలు చేస్తే 2004, 2009లలో నాటి ముఖ్యమంత్రులు జిల్లాలో యూనివర్సిటీల ఏర్పాటుకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎంలు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలుచేయలేదని, స్వరాష్ట్రం వచ్చినా విద్యార్థుల డిమాండ్ పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య అంటూ విద్యార్థులను మోసం చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా తగిన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలిసారి జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రులుగా బాధ్యతలు చేపట్టారని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు జిల్లాలో యూనివర్సిటీని నెలకొల్పేందుకు కృషి చేసి, విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపి, వినయ్, అనూష, అఖిల, సురేష్, శ్రీకాంత్, ప్రియా, పృథ్వి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా వ్యర్థాలు..!



ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద ప్లాట్‌ఫాం నంబర్ 1 పార్కింగ్ స్టాండ్ పక్కన ఉన్న ఖాళీ స్థలం డంపింగ్‌యార్డును తలపిస్తోంది. రైల్వే స్టేషన్ నుంచి వెలువడే వ్యర్థాలు, చెత్తను సిబ్బంది ఆ ఖాళీ స్థలంలో పడేస్తుండడంతో ఇదిగో ఇలా ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయాయి. అంతేకాక ఖాళీ స్థలంలో తీసిన గుంతలో మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తాచెదారంతో ఇంత అధ్వానంగా కనిపిస్తున్నా.. అధికారులు తమకేమి పట్టనట్లు ఉంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

– ఖమ్మంమయూరిసెంటర్